క్లుప్తంగా

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

చీరాల: పట్టణంలో గొల్లపాలెం నుంచి కాలువలలో నీరు ప్రవహించే విధంగా కుందేరులోని పైపులైన్లు పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పైపులైను పనులను పరిశీలించారు. అలానే పాపరాజుతోటలో పీహెచ్ ట్యాంకు వద్ద రూ.2.35 లక్షలతో నిర్మిస్తున్న సీసీ డ్రైన్లు, కల్వర్టు పనులను పరిశీలించి అధికారులకు సలహాలు, సూచనలు అందించారు. అలానే పట్టణంలోని ఉజిలిపేట, మరియమ్మపేట, జాన్‌పేట ప్రాంతాలకు సంబంధించి శ్మశానవాటికకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అక్కడ ఉన్న మురికినీరు చెరువును ఇసుకతో పూడ్చే పనులను జరుగుతున్నాయి. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కంపా అరుణ్, మున్సిపల్ డీఈ ఐసయ్య, కట్టా రవి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర మండల కో ఆర్డినేటర్‌గా గవిని

చీరాల టౌన్: స్వచ్ఛ ఆంధ్ర మండల రిసోర్స్ కోఆర్డినేటర్‌గా గవిని జగన్‌మోహన్‌రావు నియమితులయ్యారు. గతంలో సాక్షర భారత్ మండల కో ఆర్డినేటర్లుగా పనిచేసిన వారిని ప్రభుత్వం ఆంధ్ర మండల కోఆర్డినేటర్‌గా నియమించింది. దీంతో సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన ఎంపీడీవో నేతాజీని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. అలానే మండలంలోని పంచాయతీల సెక్రటరీలను మండల కోఆర్డినేటర్ కలిశారు.


1152 సర్టిఫికెట్లు పంపిణీ

మార్టూరు: జగనన్న సురక్ష పథకంలో భాగంగా వలపర్ల గ్రామ సచివాలయం-1,2 పరిధిలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో కే లక్ష్మీదేవి 1152 మంది గ్రామస్తులకు పలు రకాల సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. సచివాలయం-1 పరిధిలో 420 మందికి, రెండో పరిధిలో 732 మందికి మొత్తం 1152 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి శిరీష, సర్పంచ్ తాళ్లూరి బ్రహ్మయ్య, ఏఓ వీ కిరణ్‌కుమార్, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు పాల్గొన్నారు.

రేషన్ అక్రమ నిల్వలపై దాడులు

చీరాల: రేషన్ అక్రమ రవాణాపై ఇంటెలిజెన్స్, రెవెన్యూ, పోలీసులు గట్టి నిఘా పెట్టారు. చీరాలలో జరుగుతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణాపై వరుస దాడులు జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం చీరాల పట్టణంలోని ఓ రేషన్ దుకాణం నుంచి బియ్యాన్ని తరలిస్తుండగా కఠారిపాలెం వద్ద అక్రమ రవాణా వ్యాపారి మోటుపల్లి వెంకటరావు, డ్రైవర్ సాయి, మరో వ్యాపారి కాశయ్యపై కేసు నమోదు చేసి 75 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 102 బస్తాల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన సమాచారంతో ఏపీ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఆదేశాలతో విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు నేతృత్వంలో విజిలెన్స్ సీఐ శ్రీహరి, సిబ్బంది దాడులు చేశారు. ఎండీయూ ఆపరేటర్ దాసరి పవన్‌కుమార్ రైస్ కార్డుదారుల నుంచి కొనుగోలు చేసి ఓ ఇంట్లో నిల్వ చేశారు. దీంతో విజిలెన్స్ సీఐ శ్రీహరి దాడి చేసి సీజ్ చేశారు. అక్రమంగా నిల్వ చేసిన పవన్ కుమార్‌పై 6-ఏ, క్రిమినల్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ డీటీలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మాజీ మంత్రి గొట్టిపాటి సోదరుడు మృతి



యద్దనపూడి: మాజీ పౌరసరఫరాల శాఖా మంత్రి గొట్టిపాటి హనుమంతురావు సోదరుడు గొట్టిపాటి వెంకటసుబ్బయ్య(75) సంవత్సరాలు ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయన అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌కు స్వయాన బాబాయి. వైఎస్సార్ సీపీ గురజాల పార్టీ పరిశీలకుడు గొట్టిపాటి భరత్‌కు చినతాత. సోమవారం ఆయన భౌతిక కాయానికి పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ నివాళులర్పించారు. వెంకటసుబ్బయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మహిళ బ్యాగ్ చోరీ

చీరాల: పట్టణంలో గడియార స్తంభం సెంటర్‌లో సోమవారం సాయంత్రం మహిళకు చెందిన బ్యాగ్ చోరీకి గురైంది. దీంతో బాధితురాలు ఒన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. చీరాల మండలం వాడరేవుకు చెందిన మల్లీశ్వరి సోమవారం మధ్యాహ్నం వ్యక్తిగత పనుల నిమిత్తం చీరాలకు వచ్చింది. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో ఉన్న జ్యూస్ షాపు వద్ద బ్యాగును పక్కన ఉన్న కుర్చీలో ఉంచి జ్యూస్ తాగింది. కొద్దిసేపటికి బ్యాగు కనిపించలేదు. దీంతో బాధితురాలు ఒన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బ్యాగులో రెండు సవర్ల బంగారం, రూ.10 వేలు నగదు ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

- వేడుకగా జగనన్న సురక్ష కార్యక్రమాలు
- పాల్గొన్న ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్
- సర్టిఫికెట్లు పంపిణీ చేసిన శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య, కరణం వెంకటేష్



కుంకలమర్రులో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఆమంచి



మహిళకు సర్టిఫికెట్ అందిస్తున్న నియోజకవర్గ వెంకటేష్



సర్టిఫికెట్ పంపిణీ చేస్తున్న కృష్ణచైతన్య

కారంచేడు/చినగంజాం: ఏపీలో పేద ప్రజలకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ, సుపరిపాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మండలంలోని కుంకలమర్రు-2 గ్రామ సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంక్షేమంతో పాటు, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్న జగనన్న పాలనను, ఎలా సాధ్యపరుస్తున్నారనే విషయాలు ఇతర రాష్ట్రాలకు చెందిన నాయకులు, అధికారులు వచ్చి పరిశీలనలు చేయడం ఇందుకు నిదర్శనమన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వార చేపడుతున్న కార్యక్రమాలను గ్రామాల్లో అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డీ విజయలక్ష్మి, డీటీ పీ సుశీల, పర్చూరు ఏఎంసీ మాజీ చైర్మన్ జువ్వా శివరామప్రసాద్, సర్పంచ్ ఈదర సౌందర్య, ఎంపీటీసీ సభ్యురాలు చల్లా రత్నకుమారి, డాక్టర్ జెస్సీరాణి, ఎంఈఓ సత్యన్నారాయణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వర్ణ-2 గ్రామ సచివాలయ ప్రాంగణంలోను జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా సహకార శాఖాధికారి కేవీ రామారావు, తహశీల్దారు ఎస్ వెంకటరత్నం, సర్పంచ్ ఎం మధుసూదనరావు, ఎంపీటీసీ సభ్యులు కట్టా బాబు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

➤ ఓటర్లు ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఆమంచి అన్నారు. పర్చూరులో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వానికి జగన్ ప్రభుత్వానికి ప్రజలు బేరీజు వేసుకోవాలని కోరారు. అనంతరం అర్హులైన 444 మందికి ఆయన సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్, ఆర్ఐ లగడపాటి నాగలక్ష్మి, జువ్వా శివరాంప్రసాద్, సర్పంచ్ మల్లా అంజమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు కోట హరిబాబు, ముప్పాళ్ల రాఘవ, మల్లా శ్రీనివాసరావు, ఎర్రాకుల తిరుమలేశ్వరరావు, ఒగ్గిశెట్టి ప్రసాద్, షేక్ కాలేషా తదితరులు పాల్గొన్నారు.

మేలు చేకూర్చేందుకే జగనన్న సురక్ష..

- ఏపీ శాప్ నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి రూరల్/బల్లికురవ/అద్దంకి/జే.పంగులూరు: అర్హులకు మేలు చేకూర్చేందుకే జగనన్న సురక్ష అని ఏపీ శాప్ నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. మండల పరిధిలోని కొండమంజులూరు, కొండమూరు గ్రామాల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణచైతన్య మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక లబ్ధిదారుడికి మేలు జరిగేందుకే కార్యక్రమం శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమం ద్వారా వలంటీర్లు, అధికారులు వారి ఇంటి వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని సత్వరమే పరిష్కార మార్గం చూపుతున్నారన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ప్రసాద్, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఆర్ వెంకటసుబ్బారావు, తహశీల్దార్ ఐ పద్మావతి, ఎంపీడీఓ రామాంజినేయులు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు స్వయంపు సురేష్, కొండమూరు సర్పంచ్ బండి శివకుమారి, కొండమంజులూరు సర్పంచ్ చొప్పరపు ప్రభాకర్, ఎంపీటీసీలు ఎస్ సుప్రియ రాంబాబు, గుర్రం కళ్యాణి, సొసైటీ అధ్యక్షుడు వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

➤ సంతమాగులూరు మండలంలోని మావిళ్లపల్లి, గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మావిళ్లపల్లిలో 464 మిస్నెకల్లులో 405 పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీదేవి, తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు పాల్గొన్నారు.

➤ అద్దంకిలోని రామ్‌నగర్-2 సచివాలయ పరిధిలో, సంతమాగులూరు మండలంలోని మిన్నేకల్లు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులకు సర్టిఫికెట్లు అందించారు. జగనన్న సురక్షలో అత్యధిక సర్వీసులు తెచ్చిన మానస, లక్ష్మీ తేజస్వీలకు కృష్ణచైతన్య చేతుల మీదుగా బహుమతి అందజేశారు.

➤ బల్లికురవ మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు, కొమ్మినేని వారిపాలెం గ్రామంలో 1470 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు, మండల కన్వీనర్ చింతల పేరయ్య, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు పసల అంజలి యర్రా శాంతమ్మ సొసైటీ అధ్యక్షుడు దర్శి రామకృష్ణారావు, జేసీఎస్ కన్వీనర్ టీ. నరేష్, ఎంపీడీవో సీహెచ్ కృష్ణ, తహసీల్దార్ కె రవిబాబు, ఈవోఆర్డీ డీ. సుమతి, డీటీ రవికుమార్ ప్రత్యేకాధికారులు శ్రీనివాసరావు, కల్పన, పీఆర్ఏఈ హనుమంతరావు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ అభిమతం..

- నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

వేటపాలెం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ అభిమతమని నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. సోమవారం మండలం పరిధిలోని కొత్తపేట సచివాలయం-2, పందిళ్లపల్లి సచివాలయం-2 పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు నేరుగా ఎటువంటి ఆలస్యం లేకుండా 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందించేలా చర్యలు తీసుకుంటుదన్నారు. కొత్తపేటలో 830 మందికి, పందిళపల్లి-2లో 250 మంది వివిధ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో శర్మ, తహశీల్దార్ అశోక్‌వర్ధన్, డిటీ మహేశ్వరి, మాజీ సర్పంచ్ చుండూరి వాసు, ఆర్‌బీకే చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, రొండా భరత్, సాధు రాఘవ, ఆవుల అశోక్, సజ్జా చంద్రశేఖర్, నాగరాజు, గుత్తి మల్లేశ్వరరావు, షేక్ కబీర్, పాపారావు, తులసి పాల్గొన్నారు.

సచివాలయ సేవలతో చాలా ఉపయోగాలు..



ఈమె పేరు ఎస్ మహేశ్వరి. వలపర్ల గ్రామం. వారం రోజుల క్రితం స్థానిక వలంటీర్ ద్వారా వివాహ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకుంది. సోమవారం అధికారులు నుంచి వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ అందుకుంది. ఇంత సులువుగా మ్యారేజ్ సర్టిఫికెట్ తీసుకుంటానని అనుకోలేదు.. సచివాలయ సేవలు, సురక్ష పథకం గ్రామీణ ప్రాంతాల ప్రజలకు చాలా ప్రయోజనకరంగా ఉందని మహేశ్వరి ఆనందం వ్యక్తం చేసింది.

చెరువు అభివృద్ధికి సహకరించండి



చెరువు అభివృద్ధిపై గ్రామస్తులతో చర్చిస్తున్న ఆమంచి

కుంకలమర్రు (కారంచేడు): గ్రామంలోని తాగునీటి చెరువు అభివృద్ధికి సహకరించి కృషి చేయాలని పర్చూరు ఏఎంసీ మాజీ చైర్మన్ జువ్వా శివరామప్రసాద్, కుంకలమర్రు గ్రామస్తులు పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను కలసి విజ్ఞప్తి చేశారు. గ్రామ సచివాలయం వద్దకు వచ్చిన ఆమంచికి విషయం తెలిపిన వెంటనే స్పందించిన ఆయన, అధికారులు గ్రామస్తులతో కలసి నేరుగా చెరువు వద్దకు వచ్చి పరిశీలించారు. సరైన సంరక్షణ లేకపోవడంతో గ్రామస్తులు చెత్తా, చెదారాలు వేయడం వలన ఇక్కడ అపరిశుభ్రంగా తయారయ్యిందని, వెంటనే వీటిని తొలగించాలని ఆయన ఆదేశించారు. అలాగే చెరువు చుట్టూ ఉన్న కట్టలను కూడా పటిష్టపరచి, కట్టల సమీపంలో చిన్న పిల్లలు ఆడుకోవడానికి చిన్న పార్కు, పెద్దలకు అవసరమైన వాకింగ్ ట్రాక్ అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. దీంతో గ్రామస్తులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

24తో డిగ్రీ అడ్మిషన్లు ముగింపు

చీరాల అర్బన్: పట్టణంలోని వైఏ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈనెల 24తో డిగ్రీ ప్రవేశాలు ముగుస్తాయని ప్రిన్సిపాల్ సీహెచ్ రమణమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 12వ తేదీతో పూర్తవుతాయని, డిగ్రీలో చేరేవారు నిర్ణీత తేదీలోపు చేరాలన్నారు. ఈ ఏడాది నుంచి నూతన విద్యావిధానం పాలసీ ద్వారా డిగ్రీ నాలుగేళ్లు ఉంటుందన్నారు. డిగ్రీలో ప్రతి గ్రూపులో ఒక అదనపు మైనర్, మేజర్ సబ్జెక్టులు చేర్చారన్నారు.

మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

చినగంజాం: అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు దాడి చేసి పట్టుకున్న ఘటన సోమవారం చినగంజాం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై కొమరిశెట్టి సురేష్ వివరాల మేరకు.. మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన బీ కోటిరెడ్డి అనే వ్యక్తి అంబేద్కర్ సెంటర్ వద్ద ఉన్న తన షాపులో అమ్ముతున్నాడని అందుకున్న సమాచారం ప్రకారం తన సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. దాడిలో అతని షాపు వద్ద సుమారు రూ.1200 విలువగల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, అతనిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు, ఆ వ్యక్తిని ఒంగోలు జైలుకు తరలించినట్లు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- గడప గడపలో శాప్‌నెట్ చైర్మన్ చైతన్య



పథకాల బ్రోచర్ అందజేస్తున్న కృష్ణచైతన్య

బల్లికురవ: కులం, మతం, పార్టీలు చూడకుండా అర్హతగల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. సోమవారం బల్లికురవ సచివాలయం పరిధిలో కొండాయపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమం నిర్వహించారు. గ్రామంలోని పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి పథకాల ద్వారా అందిన లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందించారు. అనంతరం ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు మండల కన్వీనర్ చింతల పేరయ్య, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి, స్థానిక నేతలు కక్కెర సత్యనారాయణ, గోరంట్ల రవీంద్ర, కందిమళ్ల హరనాథబాబు, కుంచపు శ్రీనివాసరావు, వాసుబాబు, రామయ్య, పావులూరి చందు, షేక్ శ్రీనువలి, కల్లి అంజనీ ప్రసాదరెడ్డి, చింతల శ్రీనివాసరావు వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు, ఎంపీడీవో సీహెచ్‌కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధి మండలిలో చర్చిస్తాం

మేదరమెట్ల: మండల కేంద్రం కొరిశపాడులో నిర్మిస్తున్న యర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకం పనులపై ఆగస్టులో నిర్వహించే జిల్లా అభివృద్ధి మండలి సమావేశంలో చర్చకు పెట్టేలా చేస్తామని ఎమ్మెల్సీ లక్షణరావు అన్నారు. మండలంలోని రావినూతల గ్రామంలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎత్తిపోతల పథకానికి మరో రూ.100 కోట్లు మంజూరు చేసి పథకాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామారావు, వినోద్‌బాబు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

- గడప గడపలో నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్



బుక్‌లెట్ అందిస్తున్న వెంకటేష్

చీరాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం నడుస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. సోమవారం చీరాల పట్టణంలోని 12వ వార్డులో బెస్తపాలెం వార్డు సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. గ్రామంలోని వార్డులలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి బుక్‌లెట్‌ను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, వార్డు కౌన్సిలర్ మామిడాల రాములు, మామిడాల సుబ్బారావు, చిలుకోటి శ్రీను, పాలెపు మురళి, గుర్రం రాఘవరావు, తుపాకుల విజయ్, తెల్లబాటి నాగేశ్వరరావు, కొండా సుబ్బారావు, కోటేశ్వరరావు, అమరా రాంబాబు, ఆంజనేయులు, చిన్ని లీలాధరరావు, వలివేటి రాము, కె.సుబ్బారావు, కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

అద్దంకి రూరల్: ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటన సోమవారం రాత్రి అద్దంకిలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. అద్దంకిలోని బత్తుల వారిపాలేనికి చెందిన బత్తుల ఆదాము స్థానిక భవానీ సెంటర్‌లో సైకిల్ మీద వెళ్తుండగా వెనుక నుంచి ఆటో ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడు ఆదామును స్థానికులు సాయంతో 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఘనంగా వీరభద్రస్వామి పల్లె మహోత్సవం



పల్లెమహోత్సవంలో భక్తులు

పర్చూరు (చినగంజాం): మండలంలోని నూతలపాడు గ్రామంలో సోమవారం నిర్వహించిన వీరభద్రస్వామి పల్లె మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నూతలపాటి వంశానికి సంబంధించిన అందరూ కలిసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఊరిలోని అన్ని వీధుల్లో తిరిగి స్వామి మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. స్వామి వారికి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని నూతలపాటి వంశం అభివృద్ధి చెందుటకు పూజలు, యాగాలు చేసి స్వామి ఆశీస్సులు పొందారు.